
క్లుప్తంగా

అప్పనపల్లికి పూర్వ వైభవం తీసుకువస్తా..


ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణరాజు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తానని ఆలయ నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ఆయన శుక్రవారం అప్పనపల్లి దేవస్థానం ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆలయానికి చేరుకున్న ఈఓకు ఆలయ ఉద్యోగులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వామి వారిని దర్శించుకుని అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆలయంలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. ఈఓ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో ఆలయానికి పూర్వ వైభవం తీసుకువస్తానన్నారు. అందరూ సమష్టిగా పని చేస్తేనే ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయం బాగుంటేనే, అందరూ బాగుంటారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పని చేయాలన్నారు.

ఇతరులకు ఆదర్శంగా నిలవాలి


అంబాజీపేటలో యూనియన్ సభ్యులకు బీమా బాండ్లు అందిస్తున్న నాయకులు

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ కుకింగ్, కేటరింగ్ హెల్పర్స్ యూనియన్‌ను బలోపేతం చేయడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని జిల్లా అధ్యక్షులు సలాది సూరిబాబు అన్నారు. అంబాజీపేటలో మండల కుకింగ్, కేటరింగ్ హెల్పర్స్ యూనియన్ కార్యాలయాన్ని అధ్యక్ష, కార్యదర్శులు పొలమూరి హరిప్రసాద్, కత్తుల బాబులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీస్‌లో ప్రతి సభ్యునికి 15 లక్షల భీమా చేయించి ఆ బాండ్లను యూనియన్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సత్యవాడ రామకృష్ణ, సత్యాల కొండలరావు, పరమట సుందరరావు, తాడి గోపి, నూకపెయ్యి ధర్మారావు, జాలెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా జగన్నాథ్


కరస్పాండెంట్ కుమారస్వామి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న వైవీ జగన్నాథ్

అయినవిల్లి: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా ముక్తేశ్వరం ఎస్‌కేఎం బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వైవీ జగన్నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు పంపించిన ఉత్తర్వులు కళాశాలకు శుక్రవారం అందినట్లు తెలిపారు.

కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వై.కుమారస్వామి చేతుల మీదుగా ఈ ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. జగన్నాథ్ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ మెంబర్‌గా 20 కళాశాలకు పనిచేసిన అనుభవం ఉంది. పీహెచ్‌డీ రీసెర్చ్ పేపర్స్‌ను ప్రజెంట్ చేయడంలో ప్రావీణ్యత సంపాదించారు. కళాశాల యాజమాన్యం బి.సుధాకర్, జి.మనోహర్, బీవీవీ ప్రకాష్, వి.శ్రీనివాస్ అధ్యాపకులు, సహాయక సిబ్బంది అభినందించారు.

తిరుమల ఆలయ పవిత్రతను కాపాడాలి

రావులపాలెం: తిరుమల ఆలయ, ఇతర హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడాలంటూ శుక్రవారం రావులపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో హిందూ సంఘాల సభ్యులు, బీజేపీ కార్యకర్తలు స్వామిని దర్శించుకుని ర్యాలీ ప్రారంభించారు. స్థానిక మార్కెట్ రోడ్డు, రింగ్ రోడ్డు, హైవే సర్వీస్ రోడ్డు మీదుగా తిరిగి గ్రామంలో నుంచి ర్యాలీని నిర్వహించి వేంకటేశ్వరస్వామి గుడికి చేరుకున్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ, దేవాలయాల పవిత్రతను కాపాడాలంటూ పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త చిన్నం చంద్రారెడ్డి, బీజేపీ అధ్యక్షుడు కేవీ కృష్ణారెడ్డి, ఎన్.సుబ్బరాజు పాల్గొన్నారు.

మూడు నెలల ముచ్చటే..

- రూ.15 వేల పింఛన్ బాధితుల ఆందోళన
- ఎందుకు తీసేశారోనని దివ్యాంగుల ఆవేదన
- రూ.6 వేల జాబితాలోకి మార్పు


మంచంపై నుంచి లేవ లేని స్థితిలో ఉన్న తిరుపతిరావు


పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న సత్యనారాయణ

మామిడికుదురు: పూర్తిగా మంచం పట్టిన దివ్యాంగులకు నెలకు రూ.15 వేల పింఛన్ అంటూ మూడు నెలలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం పరిశీలన పేరిట అర్హులైన పలువురు పింఛన్లను ఆ జాబితా నుంచి తొలగించి రూ.6 వేలు సాధారణ దివ్యాంగుల జాబితాలో చేర్చడంపై లబ్ధిదారులు తీవ్రంగా మండి పడుతున్నారు. గత నెలలో సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో పలువురు అర్హుల పేర్లను మంచానికే పరిమితమైన దివ్యాంగుల జాబితా నుంచి తొలగించి, వారికి ఈ నెల సాధారణ దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు ఇచ్చారు. మూడు నెలలు రూ.15 వేల పింఛన్ ఇచ్చి, దాన్ని రూ.6 వేలు జాబితాలోకి మార్చడంపై లబ్ధిదారులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నా తమ పింఛన్లు ఎందుకు మార్పు చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. మామిడికుదురు మండలంలో నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల పరిధిలో మంచం పట్టిన దీర్ఘకాలిక దివ్యాంగులు 33 మంది ఉన్నారు. వారిలో పరిశీలన పేరుతో పది మందిని సాధారణ దివ్యాంగుల జాబితాలోకి మార్చారు. ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎందుకు పెంచారు. ఎందుకు తమ పేర్లు మార్పు చేశారో తెలీయడం లేదంటూ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.15 వేల పింఛన్ కోల్పోయిన బాధితుల వేదన ఇది..

మంచానికే పరిమితం... అయినా తీసేశారు

నాకు కుడి కాలు, కుడి చేయి పని చేయదు. మంచంపై నుంచి లేచి నిలబడడం కూడా కష్టమే. నాకు మూడు నెలలు రూ.15 వేలు పింఛన్ ఇచ్చారు. గతంలో ఇసుక కార్మికుడిగా జీవనం సాగించే వాడిని. ఆరేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాను. నా భార్య నాగమణి నేను జీవనం సాగించడం చాలా కష్టంగా ఉంది. నేను నిరుపేదను. నా పింఛన్ ఎందుకు తీసేశారో అర్థం కావడం లేదు. అధికారులు దీనిపై స్పందించి నా కుటుంబానికి న్యాయం చేయాలి.

– కోలా తిరుపతిరావు, అప్పనపల్లి

15 ఏళ్లుగా పక్షవాతం వేధిస్తోంది

లైటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడిని 15 ఏళ్ల క్రితం పక్షవాతం బారిన పడ్డాను. మంచం మీద నుంచి అతికష్టం మీద లేచి కూర్చోవడం తప్ప ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నాది. నాకు రూ.15 వేలు పింఛన్ ఇచ్చేవారు. మూడు నెలలు ఇచ్చి ఈ నెల నుంచి పింఛన్ తీసేశారు. కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. మూడు నెలలు ఇచ్చారు కదా ఇప్పుడెందుకు తీసేశారో అర్థం కాని పరిస్థితి. నా భార్య సత్యవతి నేను బతకడం చాలా కష్టంగా ఉంది. మా పింఛన్ పునరుద్ధరించి మళ్లీ రూ.15 వేలు ఇవ్వండి. మా కుటుంబాన్ని ఆదుకోండి.

– బొంతు సత్యనారాయణ, అప్పనపల్లి

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా



మలికిపురంలో ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

మలికిపురం: విద్యుత్ కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని శుక్రవారం మలికిపురం సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ ధర్నానుద్దేశించి మాట్లాడారు. ఇష్టానుసారం ప్రభుత్వం విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ తదితర పేర్లతో మరో రూ.8,100 కోట్ల అదనపు విద్యుత్ భారాన్ని ప్రజల మీద వేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన అన్నారు. గతంలో రెండు నెలలకు చెల్లించే అదే బిల్లును ప్రస్తుతం ఒక నెలకే చెల్లించడం అంటే ప్రజల నెత్తిన మరింత భారాన్ని మోపడమేనని ఆయన విమర్శించారు. తొలుత మలికిపురం సెంటర్ నుంచి సబ్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించి సబ్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులను కలసి అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిచ్చిక గంగాధర్ రావు, చెల్లిబోయిన తాతారావు, మేడిచర్ల సత్యనారాయణ, కొండ సత్తిబాబు, పుల్లెల ఆనంద్, వై.వెంకట్, దీపాటి గంగాచలం, బత్తుల రవి ప్రసాద్, ఎడ్ల నాగేశ్వరరావు, దీపాటి సత్యంబాబు, ఆదాం తదితరులు పాల్గొన్నారు. సామాజిక సేవా కార్యకర్త తాడి సహదేవ్ ఈ ఉద్యమానికి నైతిక మద్దతు తెలియజేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

అంబాజీపేట: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా తరచూ అంతరాయం కలగడంతో పాటు లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని తక్షణమే విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఎండీకి శుక్రవారం వినతి పత్రాన్ని పంపారు. గత మూడు నెలలుగా విద్యుత సమస్య తీవ్రంగా ఉండి విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కారణం ఓవర్ లోడు వస్తున్న నేపథ్యంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం, లోవోల్టేజీ ఏర్పడుతుందని అధికారుల ద్వారా తెలిసిందన్నారు. అంబాజీపేట ఫీడరకు సుమారు 20 కిలోమీటర్లు దూరంగా ఉన్న చలపల్లి ఫీడర్ నుంచి అనుసంధానం చేశారన్నారు. ఈ విషయమై అమలాపురం విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి చల్లపల్లి ఫీడర్‌ను మార్చి గతంలో సరఫరా అయినట్లుగానే అమలాపురం నుంచి విద్యుత్ సరఫరాను ఇవ్వాలని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు.

రెండు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలి

పి.గన్నవరం: సర్వశిక్షాభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో చేసిన 22 రోజుల సమ్మె కాలానికి కూడా జీతాల చెల్లింపు జరపాలన్నారు. జీతంపై ఆధారపడి పని చేస్తున్న చిరుద్యోగులకు సకాలంలో వేతనం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బౌద్ధ స్తూపం అభివృద్ధికి కార్యాచరణ


ఆదుర్రులో బౌద్ధ స్తూపం ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిడికుదురు: ఆదుర్రు ఆది బౌద్ధ స్తూపాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ శుక్రవారం కరవాక రేవు నుంచి బోటులో గోగన్నమఠం మీదుగా గోదావరి నదిలో ఆదుర్రు బౌద్ధ స్తూపం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పర్యాటక కేంద్రాన్ని పరిశీలించారు. దానికి చేరువలోనే ఉన్న ఆదుర్రు ఆది బౌద్ధ స్తూపాన్ని కలెక్టర్ పరిశీలించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ టెంపుల్ టూరిజం, టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని కలెక్టర్ తెలిపారు. దానిలో భాగంగా కోనసీమ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. దీనిలో భాగంగా పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎమ్మార్వో మృత్యుంజయరావు ఉన్నారు.

తొలగించిన కొబ్బరి చెట్లకు నష్టపరిహారం ఇవ్వాలి


కె.పెదపూడిలో స్థానికుల నుంచి వివరాలను సేకరిస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: ఓఎన్జీసీ రిగ్గు ఏర్పడిన కారణంగా కె.పెదపూడి శివాలయం రహదారిలో అడ్డుగా ఉన్న కొబ్బరి చెట్లను తొలగించిన వాటికి తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ సైటు వద్ద రిగ్గు తొలగిస్తూ అక్కడ ఉన్న యంత్రాలు, సామగ్రిని ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా స్థానికులు శుక్రవారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఓఎన్జీసీ ప్రారంభించిన వెంటనే గ్రామానికి అవసరమైన రహదారి, కమ్యూనిటీ భవనం, తాగు నీరు ఇస్తామని ఓఎన్జీసీ అధికారులు మాట ఇచ్చి పనులు మొదలు పెట్టారన్నారు. ఇక్కడ ఓఎన్జీసీ సైట్‌లో పనులు పూర్తి చేసికుని గ్రామాభివృద్ధికి సహకరించకుండా వెళ్లిపోడంపై స్థానికులు ఓఎన్జీసీ అధికారులను నిలదీశారు. దీంతో ఎస్సై కె.చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులు, ఓఎన్జీసీ అధికారులతో చర్చించారు. ఓఎన్జీసీ ద్వారా కొబ్బరి చెట్లకు నష్టపరిహారం మూడు రోజుల్లో అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారు. ఆ ప్రాంతంలోనే చెట్లు కోల్పోయిన వారి నుంచి వివరాలను సేకరించి ఓఎన్జీసీ అధికారులకు పంపిస్తామన్నారు. ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేసి సహకరిస్తామని స్థానికులకు సైట్ బృందం తెలిపారు.

చలో కాకినాడ సభకు తరలిరావాలి

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణ, ఎస్సీల మత స్వేచ్ఛ అనే అంశాలపై కాకినాడలో ఈ నెల 12న ఏర్పాటు చేసిన సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. అంబాజీపేట వచ్చిన రాజేష్‌కు పుల్లేటికుర్రులో మాలమహానాడు నాయకులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, చిన్నం బాలవిజయరావు, బట్టు బంగారం, ఎన్‌ఎస్‌ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన స్టాలిన్


వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన స్టాలిన్‌బాబు

అంబాజీపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయాలని జగన్ స్టాలిన్‌కు సూచించారు. కోనసీమలో పార్టీ పరిస్థితిని స్టాలిన్‌ను అడిగి జగన్ తెలుసుకున్నట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీకి, కార్యకర్తలకు, నాయకులకు మంచిరోజులు వస్తున్నాయని, అందుకోసం తగిన కృషి చేయాలని చెప్పారని స్టాలిన్ తెలిపారు.

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం


చింతలూరులో డ్రైడే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ దృష్ట్యా అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

మద్యం దుకాణాల ఏర్పాటు వద్దు

ఆలమూరు: కొత్తూరు–వెదురుమూడి రోడ్డులోని చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి గ్రామాల వెంబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు వినతులు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీలు తీర్మానం చేసేందుకు సన్నద్ధమవుతున్నాయి. రహదారి వెంబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని, మహిళల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

జగన్మాతా నమోస్తుతే..

- బాలాత్రిపుర సుందరి, గాయత్రీదేవిగా అమ్మ దర్శనం
- తరలివచ్చిన భక్తులు


మామిడికుదురులో బాలాత్రిపుర సుందరిగా దుర్గమ్మ


అయినవిల్లిలో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


ఉచ్చిలిలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన విజయదుర్గాదేవి


అంబాజీపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు

మామిడికుదురు: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం కనక దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. మామిడికుదురు విజయదుర్గమ్మ బాలాత్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు కనులవిందుగా దర్శనమిచ్చారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష్మీగణపతి అభిషేకాలు, మల్లేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. పెదపట్నం అగ్రహారం, మగటపల్లి, నగరం, మొగలికుదురు, గెద్దాడ, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబాజీపేట: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అంబాజీపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద దుర్గమ్మా చల్లంగా చూడమ్మా అంటూ మహిళలు శుక్రవారం ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయకనకదుర్గ ఆలయంలోను, మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోను కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మారిని చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద వీధిలో ఉన్న బేతాళ స్వామి ఆలయంలోను విజయ బేతాళుడికి, మాచవరం పక్షుల రావి చెట్టు వద్ద శ్రీరాంనగర్‌లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద పూజలు జరిపారు. గంగలకుర్రు ఉమాపార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజ్యం సుబ్రహ్మణ్య శర్మ, శ్రీనివాసరావుల పర్యవేక్షణలో పూజలు చేశారు.

గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గ

అయినవిల్లి: మండలంలోని దూనబోయినవారిపాలెంలో కొలువైన కనకదుర్గమ్మవారు శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి చిట్టిబాబు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముక్తేశ్వరంలోని ముక్తికాంత అమ్మవారికి, లక్ష్మీదేవి అమ్మవారికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

అమ్మవారికి విశేష పూజలు

ఆత్రేయపురం: శరన్నవరాత్రులు పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ప్రధానంగా ఆత్రేయపురంలో బాలాత్రిపుర సుందరీ రాజరాజేశ్వరీ స్వామి ఆలయం, కనకమహాలక్ష్మి, మల్లమ్మ, విజయదుర్గా దేవి, ధ్యాన ధర్మపీఠంలో దుర్గా మాతకు ప్రధాన ఆర్చకుడు పుల్లేటికుర్తి రామలింగేశ్వరశర్మ, భాస్కరశర్మ, ప్రబల రవి ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, హరికథలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పేరవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన కనకదుర్గ, వసంతవాడ పార్వతీదేవీ, వాడపల్లి, ర్యాలి తదితర గ్రామాల్లో వేంచేసిన ఆలయాల్లో వివిధ రకాల పూలతో అలంకరించారు.

సామూహిక కుంకుమ పూజలు

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం కనకదుర్గాదేవి ఆలయాలు, నవరాత్రి పందిళ్లలో అమ్మవారిని వివిధ అవతారాల అలంకరణ, ప్రత్యేక పూజలు, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల రామచంద్రశర్మ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక బొరుసువారి సావరం విజయ కనకదుర్గాదేవి ఆలయం, ఏనుగులమహల్ రాజరాజేశ్వరిదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం) ఆలయం, బోడిపాలెం దుర్గాదేవి ఆలయం, మారుతీ సెంటర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు దేవీ నవరాత్ర మహోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు.